

# ముళ్ళ గులాబి

ఆకుల శశికుమార్

కూత వేసి ముందుకి సాగింది రైలు. అప్పటిదాకా స్టైల్‌గా, ప్లాట్‌ఫారమ్ మీద నిలబడిన ఫ్రెండ్స్‌తో మాట్లాడుతున్న వాడల్లా తల యెగరేసి, జేబులోంచి రుమాలు తీసి గాలిలో ఊప సాగాడు మహేష్. రైలు ప్లాట్‌ఫారమ్ దాటి స్నేహితులు కనుమరుగు కాగానే క్రాఫు సవరించుకుంటూ వెనుదిరిగాడు.

రెండూ రెండు కలిసి నాలుగు కళ్ళయి నాయి.

చటుక్కున తల తిప్పుకుందామ్మాయి. "ఎంత నాజూకుగా, అందంగా వుంది" అనుకున్నాడు.

సరిగ్గా తన ఎదుటి సీటులోః ఎంత అదృష్టవంతుడు తనుః

కూర్చుంటున్నప్పుడు కిటికీలోంచి గాలి ముఖానికి కొట్టి క్రాపు చెదిరిపోయింది. "నుప్పెడ్ బ్రీజ్" అని తిట్టుకుంటూ స్టైల్‌గా తలెగరేశాడు. జుట్టు దానంతటదే యథాస్థానంలో సర్దుకునేటుగా.

ఆ అమ్మాయి తననే గమనిస్తున్నట్టుగా ఫీలై జారగిలబడినట్లుగా కాళ్ళు కాస్త

ముందుకు చాపి వెనక్కి వాలి కూర్చుని. కళ్ళు మూసుకున్నాడు. కళ్ళు ఎర్రగా వుండి మండటమే కాక తలమీద ఎవరో టన్నుల బరువు పెట్టినట్టుగా భారంగా అనిపించింది.

మూడు రోజుల్నుంచి కంటికి కునుకన్నది లేదు. పెళ్ళి పనులతో అలిసిపోయిన తను విశ్రాంతి తీసుకోకుండానే ఈ టెలిగ్రాం. ప్చ్. పాపం! రమేష్ వాళ్ళింట్లో పరిస్థితి ఎలా వుందో! ఇంత చిన్న వయసులోనే వాడికి నూకలు చెల్లిపోయాయి. అయినా ఖర్మ కాకపోతే ఆ రోడ్డుమీద అన్ని వందలమంది జనం పోతూంటే కుటుంబమంతటికీ ఆధారమైన వాడి మీదికే రావాలా ఆ లారీ. ప్చ్! వాళ్ళింట్లో అంతా గోడుగోడున యేడుస్తుంటారు. తనెళ్ళి యేం చెయ్యాలిప్పుడు! ఆలోచన లెక్కువైతే ఇంకింత తలనొప్పి వస్తుందని, కాలక్షేపానికి, కళ్ళు తెరిచి పెట్టెంతా కలియజూశాడు. తెరిచిన కళ్ళకి ఎదురుగా తననే చూస్తున్న అందమైన ఆ అమ్మాయి ముఖం కన్పించింది.

పట్టుబడిపోయినట్టుగా చిన్నగా నవ్విందామె.

ప్రతిగా చిరునవ్వు చిందించాడు మహేష్. పలకరించుదామా అనుకున్నాడు ఇంతలో ఆమె చొరవ చేసింది.

"రైలు బైల్దేరడమే నిద్ర వస్తోందా!" ముత్యాల్లాంటి పలువరుస తళుక్కు మనిపించే చిరునవ్వుతో కళ్ళల్లో మెరుపులు కదిలిస్తుండగా ప్రశ్నించింది.

ఒక్క క్షణం విస్తుపోయాడు మహేష్ ఆమె చనువుకి. మరుక్షణమే నవ్వేశాడు.

"వచ్చే నిద్ర ఎగిరిపోయింది" అన్నాడు తనూ చనువు కనబరుస్తూ.

"అదేం" ఆశ్చర్యంగా అడిగింది.

"మీతో మాట్లాడాలన్పించి" అన్నాడు అర్థవంతంగా నవ్వుతూ.

సిగ్గుతో కనురెప్పలు వాల్చింది. "చూడగానే అంత ఆత్మీయత కలిగిందేం!" అన్నీ అబద్ధాలు అన్న నేరారోపణం ధ్వనించిందామె కంఠస్వరంలో.

"మనస్సే సాక్ష్యం."

"మనసు మాట్లాడదుగా!"

"అవును, ఫీలవుతుంది" కొంటెగా నవ్వాడు.

"బాగుంది; ఊరూ పేరూ తెలియని మనిషిని...."

"అదెంత సేపు తెలుసుకోవడం! నా మటుకు నేను హైద్రాబాదులో ఎమ్మెస్సీ ముగించి. ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో వున్నాను. మా అమ్మ, నాన్నలకి నేనొక్కణ్ణే పుత్రరత్నాన్ని. ఉన్న ఒక్క చెల్లెలి పెళ్ళి మూడు రోజుల క్రితమే జరిగిపోయింది."

"అలాగా"

"అలాగే. కాని, తమరి గురించి తెలుసుకోనివ్వరా నన్ను?"

"తెలుసుకోండి, వద్దన్నానా!" కొంటెగా నవ్వింది.

"భలేవారే. మీతో అందంలోనే కాదు. మాటల్లో కూడా ఎవరూ పోటీ వెయ్యలేనట్టుంది"

"అవునవును, మీతో నెగడటంలో గెలవలేనట్టుగా"

"అసలు విషయం దాటవేస్తున్నారు."

"తెలుసుకుని యేం చేస్తారు! రైలు గమ్యం చేరుకున్నాక మీదారి మీది, నాదారి నాది. మన పరిచయం దారి గోదారి" అంది గమ్మత్తుగా.

"గోదారో, రహదారో అంతా మీమీదే ఆధారపడి వుంది."

చటుక్కున కళ్ళెత్తి చూసింది రేఖ.

కాసేపాగి మెల్లిగా అంది. "రైలుదిగాక ఫ్రెండ్సుని కలుస్తారు, తర్వాత నేనే వచ్చి ఎప్పుడైనా గుర్తుచేసినా రేఖా! అసలా పేరే వినలేదే అంటారు" అని.

"ఓష్! అయితే మీ పేరు రేఖ అన్న మాట. మీలాగేను పేరుకూడా నిజంగా చాలా అందంగా వుంది."

"అదిగో. అందుకే అన్నాను. పొగడ్డంలో మిమ్మల్ని మించినవాళ్ళు లేరని."

"మరే. నేనూ అదే అంటున్నాను, మాటల్లో మిమ్మల్ని గెలిచేవాళ్ళు లేరని. అలాగ అటొంచీ అడిగించుకుంటూ మాటల్లో పెట్టి మభ్యపెడుతున్నారేగాని అసలు విషయం చెప్పారా?"

"అంత చెప్పుకోదగ విషయాలేం కావు లెండి. నాకు అమ్మలేదు నాన్నగారు ఉన్న ఊళ్ళోనే ఉన్నా, నన్ను లేడీస్ హాస్టల్లో పెట్టి బి. ఎ. చదివిస్తున్నారు" అంది ముఖం దించుకుని.

"స్వంత ఇల్లా?"

"యేం? ఇల్లరికం వస్తారా?"

చిలిపిగా నవ్వుతోంది. సొట్టలు పడుతున్న ఆ గులాబీ బుగ్గలు మహేష్ని ఏవో లోకాలకు తీసుకువెళుతున్నాయి. తమ సంభాషణ ఎంత స్పీడ్‌గా జరిగింది? ఎంత గమ్మత్తైన పరిచయం? ఎంత అందమైన ఊహ, ఎంత చక్కటి అనుభవం: ఈ క్షణం ఇలా నిలిచిపోతే ...?

ఈ హాయి శాశ్వతమైతే? ఆ అందం తనదైతే?

మహేష్ కళ్ళు మత్తుగా వాలిపోతున్నాయి.

"లాభం లేదు. నేనేదో బోర్ కొడుతుంది కాలక్షేపం కలిగిస్తారు కదా అని మిమ్మల్ని పలకరించితే మీరేమో కళ్ళు మూసుకుని కలలు కంటున్నారు."

ఉలిక్కిపడ్డాడు మహేష్.

నిజానికి అతడి శరీరం నిద్రాభారానికి వాలిపోతున్నది. నిద్ర లేమి తో ఎర్రబడ్డ కళ్ళు. పెళ్ళి కాగానే రెస్టు తీసుకోనీయకుండా బండెక్కవలసి వచ్చినందుకు అలసిపోయిన మెదడు శరీరం మాకు విశ్రాంతి కావాలో హో అంటూ గోల పెడుతున్నాయి.

ఎంత ఇష్టంగా వున్నా రాత్రంతా కూర్చుని రేఖతో కబుర్లు చెప్పే ఓపిక లేకపోయింది మహేష్‌కి. ఆ విషయమే చెప్పాడు ఆమెతో.

"అరెరె. ఐయామ్ రియల్లీ వెరీవెరీ సారీ మీరు పడుకొని నిద్ర పొండి: మీ బాగ్‌లో వున్న పుస్తక మిచ్చి" అంది రేఖ చివర్ని సన్నగా నవ్వుతూ.

అందాల రేఖ అధారీ చెలాయించినా ఆనందమే కలిగింది మహేష్‌కి. పుస్తక మిచ్చి, ఆమెకు క్షమాపణ చెప్పుకుని వెనక్కి వాలి పడుకున్నాడు. కిటికీలో నుంచి చల్లటి గాలి మొహాన్ని తాకుతుంటే ఒళ్ళెరక్కుండా నిద్రపోయాడు మహేష్.

హాయిగా గాలి వీస్తోంది. ఏవో మత్తెక్కించే పరిమళాలు ముక్కుపుటాలను పరామర్శిస్తుంటే, మెలకువ వచ్చినా కళ్ళు విప్పకుండా అలాగే పడుకున్నాడు మహేష్. వంటింట్లో గిన్నెల చప్పుడు విన్పిస్తోంది. భార్యను పిలుదామా అనుకున్నాడు. మళ్ళీ తనే వచ్చి లేపనీ అనుకుంటూ మరో పక్కకి వత్తిగిలి పడుకున్నాడు.

ఎంత అదృష్టవంతుడు తను!

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడెన్‌సా
విరేపనముతో
చికిత్సను పొందండి
– శస్త్రచికిత్స
అవసరములేదు!
Beasons-2141.TEL

రేఖతో పరిచయం కావడం యేమిటి, జీవితంలో చోటు చేసుకోవడం యేమిటి— తలుచుకుంటే అంతా చిత్రంగా సినిమాలో చూస్తున్నట్టుగా అనిపిస్తుంది. కాని, నిజం గానే రేఖ. అందాల రేఖ ఇప్పుడు తన భార్య. అందమైన, గొప్పింటి పిల్ల భార్య కావడం తన అదృష్టం కాక మరేమిటి?

కేవలం అందం ఒకటే అయితే తను రేఖను చేసుకోగలిగేవాడేనా? అచ్చంగా రేఖ అన్నట్టే ఇల్లరికం వెళ్ళాడు తను. అందమూ ఆస్తి కలిసిరావడంతో ఆనందంతో పొంగులెత్తుతున్నాడు తను.

అయినా ఇంకా ఆ ఆలోచనెందుకు? రేఖ తనదైంది. అదే చాలు.

తన కోమలమైన హస్తాలతో అతని కళ్ళు రెండూ మూసింది రేఖ. చిరునవ్వుతో అతని పెదవులు విచ్చుకున్నాయి. చప్పున ఆ చేతులు పట్టుకుని ముందుకి లాక్కున్నాడు.

"ఉహూం. నాన్నగారొచ్చేస్తారు. వారికింకా మీఆఫీసుకి టైముకూడా అయింది. లేవరేం ఇంకా?" అంది సుస్మితంగా వదిలించుకుని, అతన్నుంచి తప్పించుకుంటూ. చిక్కినట్టే చేసి తప్పించుకున్న రేఖను చూసి కోపం వచ్చింది మహేష్‌కి. అతని బుంగ మూతి చూసి, తెల్లటి పళ్ళు, గులాబీ చిగుళ్ళు అందాలు చిందిస్తుండగా ఆపుకోలేని నవ్వుతో గాలికి ఊగే తీగలా రెపరెపలాడింది రేఖ.

"అందీ అందనట్టుంటూ ఊరిస్తున్నావు కదూ; ఉండు నీ పని చెబుతా" పక్కమీద నుంచి లేచాడు. గబుక్కున మంచం దిగి, వెనుదిరిగి వెక్కిరించి మరీ పరిగెత్తింది రేఖ వడుగున వెళ్ళి. ఆమె గుమ్మం దాటబోతుండగా పట్టుకోబోయాడు. చేతికామె సుకుమార శరీరం అందకపోగా తలుపు చెక్క తలని ముద్దెట్టుకుంది.

కళ్ళు బైర్లు కమ్మాయి మహేష్‌కి. నిముషంపాటు తనెక్కడున్నదీ, ఏం చేస్తున్నదీ, అసలేం జరిగిందీ అర్థమే కాలేదతనికి. మెలకువ పూర్తిగా తన స్వాధీనంలోకి వచ్చేప్పటికి రైల్లో అవుతూంది. రైలు కుదుపుకి నిద్రమత్తులో తలవెళ్ళి కిటికీకి గుద్దుకోగా మెలకువ వచ్చిందతనికి. ఒక నిముషం తలంతా దిమ్ముగావుంది ఏం కన్పించలేదు. చేత్తో దెబ్బ తగిలినచోట తడుముకుంటూ "అబ్బ" అనుకున్నాడు. కళ్ళింకా మండుతూనే వున్నాయి.

చటుక్కున అతనికి రేఖ గుర్తొచ్చింది.

ఎదురు సీటులో ఆమె లేదు.

బాత్‌రూంలో ఉన్నట్టుంది, నీళ్ళ శబ్దం వస్తూంది.

ఆమె సీటులో రాత్రి తానిచ్చిన పుస్తకం వుంది!

రైలు హైద్రాబాదు సమీపిస్తూంది. మహేష్‌లో ఆత్రుత ఎక్కువైంది. బాత్‌రూం దగ్గరగా వెళ్ళి పిలుద్దామా అనుకున్నాడు. అతడు ఏ విషయమూ నిర్ణయించుకునే లోపలే రైలుబండి నాంపల్లి స్టేషనులో ఆగింది.

"మై గుడ్‌నెస్. ఆమెతో మాట్లాడకుండా, ఆమెను చూడకుండా ఎలా దిగిపోవడం? అయినా ఆమె దిగేది కూడా ఇక్కడేగా? ఇంకా బైటికి రాదేం? ఆలోచనలతో సతమతమౌతూ లేచి నిలబడ్డాడు మహేష్. పది నిముషాలు చూసి బాత్‌రూం దగ్గరగా వెళ్ళి తలుపు తోయబోతుండగా తెరుచుకుంది. 'అమ్మయ్య' అనుకోబోతూండగానే విస్మయం ఆవరించింది అతన్ని.

వచ్చింది రేఖ కాదు!

మరి ఆమె యేమయింది? ఆశ్చర్యంతో తల మునకలవుతూ తన సీటు దగ్గరకి వచ్చాడు మహేష్. అనుకోకుండా అతడి దృష్టి తన సీటు క్రిందిభాగం మీద పడింది.

అరె. తన బాగ్ తన కొత్త ఎయిర్ బాగ్ యేమయింది? మహేష్ కళ్ళు పత్తి కాయల్లా అయినాయి. కంగారుగా గబగబా కంపార్ట్‌మెంట్ నలుదిక్కులా కలియజూశాడు. ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. బాగ్ కన్పించలేదు.

హఠాత్తుగా అతనికి మెరుపులా తట్టింది అది రేఖ చేసిన పని అని.

"హుం! ఎంత మోసం చేసింది" పళ్ళు బిగించి ఆమె సీటువైపు దృష్టి మళ్ళించాడు.

ఆ పుస్తకం ఇంకా అక్కడే వుంది.

"ఇదొక్కటీ మరచిపోయిందేం నసిడకి. దొంగ రాస్కెల్. ఎంత తేలిగ్గా బుట్టలో వేసి ఫూల్ని చేసింది" కోపం పట్టలేకుండా అన్నాడతను. కళ్ళు మరింత ఎర్రబడి నిప్పు కణికల్లా జ్వలిస్తున్నాయి. పెదవులు అదురుతుండగా ఆ పుస్తకం తీసి విసిరికొట్టబోయి. ఎందుకో ఆగిపోయాడు.

జారిన పుస్తకంలో నుంచి తెల్లటి కాగితం కింద పడింది.

"గుడ్ మార్నింగ్ మిస్టర్ ఇన్నోసెంట్ మహేష్.

ఇంత తేలిగ్గా మిమ్మల్ని బుట్టలో వేసి లాభం చేసుకున్నందుకు నన్ను నేనే అభినందించుకుంటున్నాను. మీ లాగే అందరికీ మనిషిని చూడగానే ఆత్మీయత కలుగుతుందని భ్రమపడకండి. అందం ఒక్కటే చూసి మీరు మీ జీవిత భాగస్వామినిలా చూడవలసింది. ప్రతి స్త్రీని వ్యక్తిత్వంకల ఒక మనిషిగా గౌరవించడం నేర్చుకోండి. క్వాలిఫికేషన్లు, మంచితనమూ జీవనానికి ఆధారం కాలేని ఈ రోజుల్లో మీలాంటి అపర్ర పురుషుల్ని మభ్యపెట్టి జీవనం గడుపుకోవలసి వస్తున్న ఆడపిల్లని నేను. ఈ వ్యాపారం చెయ్యడానికి నాకు కావలసింది, ఉన్న ఈ "అందం" అన్న క్వాలిఫికేషనొక్కటే. నేను పట్టి అందమైన గులాబినే కాదు ముళ్ళగులాబిని. ఇంకెప్పుడూ అందాన్ని చూసి మోసపోకండి. మళ్ళీ ఎప్పుడైనా ప్రయాణాలు చేసినప్పుడు నన్ను గుర్తు తెచ్చుకుని జాగ్రత్తగా వుండమని హెచ్చరిస్తూ!

— రేఖ.

పళ్ళు పటపట కొరికి ఉత్తరాన్ని ముక్కలు ముక్కలు చేసి విసిరేసి కాగితం ముక్కలు గాలిలో ఎగురుతూంటే చేతకానితనంతో కూడిన కోపంతో అలాగే కసిగా చూస్తూ నిస్సహాయుడుగా నిలబడిపోయాడు. ★

